# ఏకపత్నీ వ్రతుడు

సరోజిని అంది: "ఎందుకలా కళ్ల వెంబడి నీళ్లు పెట్టుకుంటారు? మొగాళ్లు ధీరులుగా వుండాలి. ఏ ఆడదైనా తన మొగవాడి ప్రేమను కోరుకుంటుంది. అదే నాకు లభించింది. నా మనస్సుకదే శాంతి! వేరేం కోరికలు లేవు. మిమ్మల్ని విడిచి దూరమయ్యేటప్పుడు కూడా ఆ నిశ్చింతతోనే నవ్వుతో పోగలను. వేరేలోకంలో అదే నవ్వుతో మీకోసం ఎన్నియుగాలైనా ఎదురుచూడగలను."

కొంచంసేపు మౌనం వహించింది. ప్రకాశరావు కళ్ళనించి కన్నీటిధారలు అంతు లేకుండా ప్రవహిస్తున్నాయి. మనస్సు దుఃఖపూరితంగానూ, విచారగ్రస్తంగాను వుంది. భావిశూన్యంగా తోచింది గావును, శూన్యంలోకి నిష్ఫలదృక్కుల్ని ప్రసరిస్తూనే, గుడ్లనీరు నింపుకు చూస్తున్నాడు. సరోజిని కొంచెంసేపు వొగర్చింది. ఆవిడముఖంలో చెప్పలేనంత ప్రశాంతత, ఆత్మసంతృప్తి, గాంభీర్యతా కనపడుతున్నాయి.

మళ్లీ ఆవిడే అనసాగింది!

"నేనెలాగూ మిమ్మల్ని విడిచిపోతాను. అది తప్పక జరిగే విషయమే. కాని నాకు ఒకటే విచారంగా వుంది. మీప్రేమకి బదులు తీర్చుకోలేకపోతున్నాను. అంతే! అదే నాకోరిక... ఈ జన్మలో కాకపోతే మరో జన్మలోనైనా...

సరోజిని పెద్ద కళ్ళు కూడా నీళ్ళతో నిండాయి. వేడి కన్నీటిబొట్లు కొన్ని తలగడమీద పడ్డాయి. ప్రకాశరావు పక్కనికూచుని రుమాలుతో కళ్ళు తుడిచాడు. ఒకసారి పెద్దకళ్ళని మూసి మళ్ళీ తెరిచింది. మూసుకున్నప్పుడు కూడా కనురెప్పలు కళ్లు ఏదో ఆలోచిస్తున్నట్టుగా తెల్పసాగాయి. అతను మౌనాన్ని ఛేదింపలేదు.

సరోజినే మళ్ళా అంది!

"అవును. ఏ రుణమైనా మానవచ్చు గాని ప్రేమరుణం మానలేం. జన్మజన్మల తరవాతైనా తీర్చాలిసివొస్తుంది. మీరు మాత్రం నిరాశపడి, జీవితాన్ని భగ్నపర్చుకోకండి. ఒంటరి జీవితాన్ని మీరు భరించలేరు. ఎవరినన్నా నచ్చిన అమ్మాయిని పెళ్ళిచేసుకుని..."

"ఛీ" అని అతను నోరు మూయడంవల్ల సరోజిని వాక్యాన్ని పూర్తిచెయ్యలేకపోయింది.

"ఛీ! అది నా జన్మలో జరగదు. నేనేం ప్రేమ విలువతెలియని క్షుద్రుణ్ణికాను. అలా జరుగుతుందని కలలోకూడా అనుకోకు. అలా చెయ్యడానికి నేనేం పక్షులకంటె హీనుణ్ణి కాదు. అవేం చేస్తాయో తెలుసా? ఒక పక్షి దంపతులు రెండుగుడ్లు పెడతాయి. అవి పొదిగాక ఒకటిఆడపక్షిగానూ, ఇంకొకటి మొగపక్షిగానూ అవుతాయి. పెద్దయ్యాక అవే దంపతులుగా మెలుగుతాయి. ఏ కారణంచేతైనా అందులో ఒక పక్షి చనిపోయినా రెండవపక్షి ఆజన్మాంతం బ్రహ్మచర్యాన్ని అవలంబిస్తుంది. మానవజాతి ఎంతో మహోన్నతమైంది సృష్టిలో అని మనం గర్విస్తాము. అలాంటి ఉత్కృష్ట సృష్టికి చెందిన నేను ఈ చిన్న నియమాన్ని వ్యతిరేకించి పక్షులకంటే హీనుణ్ణికాలేను. అది నా స్వభావానికే వ్యతిరేకం!" రుద్ధకంఠంతో, శూన్యంలోకి చూస్తో చెప్పాడు.

సరోజిని ముఖాన్ని ఒకరకమైన సంతోషం, ఒకరకమైన విచారం ఆక్రమించుకున్నాయి. ఏం చెప్పాలో తెలియక వూరుకుంది. చాలా క్షణాలు మౌనంగా దొర్లాయి.

ప్రకాశరావు సహజంగా చాలా నియమాలుకల మనిషి. అది అతన్ని ఎరిగున్నవారందరికీ తెలును. అందులో ఏకపత్నీవ్రతం అన్నిటికంటే పెద్ద నియమం అతనికి. చదువుకునేరోజుల్లోనూ, తర్వాతాకూడా అతని మిత్రబృందం ఎప్పుడైనా క్లబ్‌ల్లోనూ, వేరేచోట్లా ఆడవాళ్ళ విషయమైన ప్రస్తావనలు తెచ్చినప్పుడు అతను అక్కడినుంచి వైదొలిగేవాడు.

ఎవరన్నా ఏమైనా అంటే "తోటిమానవుల్ని గురించి అలా చవకగా మాట్లాడుతూంటే నేను సహించలేను. మీలా అలా క్షుద్రత్వానికి దిగజారలేను" అనేవాడు.

ప్రకాశరావు సరోజిన్ని చదువుకునే రోజుల్నించీ ఎరుగును. అప్పుడే వాళ్ళకి ప్రేమ కలిగింది. అది వాళ్ళ వివాహానికి దారితీసింది. అతనికి ప్రేమనిగురించి కల భావాలు అనిర్వచనీయాలు. అవి తక్కినవాళ్లు అర్థం చేసుకోలేరు. ఒకవిధంగా తక్కినవాళ్లకి ప్రేమంటే తెలీదనీ, ఒక రకమైన వివాహాన్నే అందరూ ప్రేమని పిలుస్తారనీ అతని ఉద్దేశం.

అతని ఐదేళ్ళ వివాహ జీవితం చాలా సంతోషదాయకంగానూ, ఉత్సాహజనితంగానూ గడిచింది. కాని దురదృష్టంవల్ల సరోజినికి జబ్బు చేసింది. అదే కొన్ని నెలల్లో ప్రమాదకరమైనదై సరోజిని జీవితాన్నే బలితీసుకునేదయింది. డాక్టర్లు నిస్సహాయతనీ, మిత్రులు నిరాశనీ వ్యక్తపరచారు. కాని ఏదో గుడ్డి నమ్మకం, ప్రేమమీదిప్రేమ, ప్రేమకి చావులేదనేభావం అతనికి గుడ్డివెలుతురులా తోచాయి. రాత్రింబగళ్లు అదే ఆశతో అతను సరోజినికి సేవచెయ్య సాగాడు.

కాని సరోజినికి ఆశలేదు. భర్తయొక్క అమితమైన ప్రేమని ఎలా స్వీకరించాలో, ఎలా పూజించాలో తెలీక కొన్ని క్షణాల్లో విస్తుపోయేది. మూగబోయేది. కాని అంతకంటే అమితమైన సంతోషం, కృతజ్ఞత, సంతృప్తి ఆవిడ కళ్ళల్లో మెరిసేవి.

చివరికి సరోజిని చనిపోయింది. ప్రకాశరావు జీవిత నాటకంలో ఒక అంకం అయి తెర దించబడింది.

అతనికి ఒక్కసారిగా చావు ఎంత శూన్యంగా తోచిందో, ఎంత దట్టమైన చీకటిగా అయిందో; వూహించడం, చెప్పడం, రాయడం కూడా కష్టం.

మిత్రులూ, బంధువులూ అంత్యక్రియలకు తోడ్పడ్డారు.

మిత్రులందరూ అతను విషం పుచ్చుకొని ఆత్మహత్య చేసుకుంటాడనీ, లేకపోతే పిచ్చివాడవుతాడనీ, లేక దేశాంతరం వెళ్ళిపోతాడనీ, హృదయం ఆగిపోయి మరణిస్తాడనీ అనుకున్నారు.

కొన్ని క్షణాల తర్వాతనే ప్రకాశరావు మామూలుగా తయారయ్యాడు. అసలు సరోజిన్నే ఎరగనట్టూ, ఆవిడతో వివాహం కానట్టూ, ఆవిడ మరణం కూడా జరగనట్టూ మెలగసాగాడు. అతని కళ్ళలో ఒక విధమైన వెర్రివికారం, మొహంలో ఒకరకమైన వేదాంత భావం కన్పడ సాగాయి.

మర్నాటినుంచీ ఆన్నాళ్ళూ గీయని గెడ్డం గీసుకుని, శుభ్రంగా తయారై మిత్రులతో మెలగసాగాడు. అది అందర్నీ ఆశ్చర్య చకితుల్ని చేసింది.

పరామర్శ చెయ్యడానికి వొచ్చిన మిత్రులు ఎలా పరామర్శించాలో తెలీక తెల్లబోయి, వెళ్ళిపోయేవారు.

జన్మలో ఎప్పుడూ ముట్టుకోని అతను సిగరెట్టు ప్రతిక్షణం చెయ్యినించి విడవని వాడిలా తయారయ్యాడు.

***

కొన్ని రోజుల తర్వాత ప్రకాశరావు వూళ్లోనించి అకస్మాత్తుగా అంతర్ధానమయ్యాడు. అది వూళ్ళో చాలా అలజడి కలిగించింది.

ఒకరోజున మిత్రులకందిన ఈ క్రింది ఆహ్వానం వాళ్ళలో చాలా సంచలనాన్నీ, ఆందోళననీ కలిగించింది.

"మిత్రులారా,

ఈవూళ్ళో స్కూల్లో పనిచేస్తున్న నా క్లాసుమేట్ శ్రీమతి సరస్వతికీ నాకూ జరిగిన వివాహ సందర్భంలో జరిగే విందుకు మీరందరూ ఆహ్వానితులు.

మీ మిత్రుడు,
ప్రకాశరావు

అందులో స్థలమూ, సమయమూ మొదలైనవి కూడా ఉదహరించబడ్డాయి.

అనుకున్న వేళకి మిత్రులందరూ పోగడ్డారు. లోపలి భావాలు వేరువేరు విధాలుగా ఉన్నప్పటికీ అందరూ పైకి అభినందనలు తెలియపర్చసాగారు. వాళ్ళు అతని జీవితం ఈవిధంగా మారుతుందని ఎప్పుడూ ఆశించలేదు. ఎందుకంటే ముందే చెప్పానుకదూ,

అతని ఆశయాలన్నిటిలోకీ ఏకపత్నీవ్రతంమీద అతనికి దృఢమైన నమ్మకం, అభిమానం కలదని–అందుకుని.

సరస్వతి చాలా ఆకర్షణీయంగానూ, సాధారణంగానూ ఉంది. ఆవిడకూడా తన మిత్రబృందాన్ని పిలిచింది. అందరితోనూ సభ ఆనందకరంగా వుంది.

టీపార్టీ సవ్యంగా జరిగింది. మిత్రులందరూ దంపతుల్ని అభినందించసాగారు.

అతని మిత్రుల్లో ఒకరు ఆశ్చర్యాన్ని వెలిబుచ్చక పోలేదు.

"మన మిత్రుని ఈ శుభసమయంలో మనందరం అభినందిస్తాం. అది చాలా సంతోషకరమైన విషయం.

"కాని అదే విషయం అతనికి పూర్వచరిత్ర తెలిసిన మిత్రులకి ఆశ్చర్యకరమైనదిగా కన్పిస్తుంది కూడా.

"ఎందుకంటే, ఆయన ఏకపత్నీవ్రత నియమానికి భంగం కలిగినందువల్ల" అని అతను కూచున్నాడు. మిత్రులు ప్రకాశరావు ఏమి చెబుతాడోనని ఎదురుచూస్తున్నారు. సరస్వతి ముఖం చిన్నబోయింది. ప్రకాశరావు తీవ్రమైన ఆలోచనలోపడ్డాడు. ఒకక్షణం నిశ్శబ్దం తర్వాత మెల్లిగాలేచి నించున్నాడు. అందరూ ఏకాగ్రతతోకూడిన నిశ్శబ్దంతో, ఆతృతతోకూడిన మొహాల్తో వినసాగారు.

అతను అన్నాడు:

"మిత్రులందరికీ, మీ అభిమానానికీ, అభినందనలకీ కృతజ్ఞత.

"కాని మన మిత్రుడు నామీద నేరమారోపించాడు. అతన్ని నేను అర్థం చేసుకోలేనని కాదు.

"కాని సరోజినికి నేనేమీ ద్రోహం చెయ్యలేదు. ఆవిడ కృతజ్ఞతాపూర్వకమైన నేత్రాలు ఇప్పటికీ నాకు చిరునవ్వు నవ్వుతోనే కనపడుతున్నాయి.

"అతను ఊహించినట్టు నేను నా నియమాన్ని జవదాటలేదు. ఎందుకంటే నా జీవితంలోని ఏ సమయంలోనూ నేను ఒక పత్ని కంటే ఎక్కువ స్త్రీల పరిచయాన్ని పొందివుండలేదు, వుండబోవడంలేదు."

శాంతంగా చెబుతూ అల్లాగేకూచున్నాడు. మిత్రుల ఆలోచనలు కట్టుబడ్డాయి. సరస్వతి కళ్లు సంతోషంతో మెరిశాయి. తక్కిన స్త్రీలు "ఎంత ఆదర్శం! ఎంత నిజం!" అనుకున్నారు. "రోజుకో మనిషిని మారుస్తో బతికే వాళ్ళకంటే నయం."

అతని మిత్రులు కూడా అదే అనుకున్నారు "అవును! అతను ఇప్పటికీ ఏకపత్నీ వ్రతుడే."

*04. 05. 1951–తెలుగు స్వతంత్ర వారపత్రిక*